క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు



స్విమ్మింగ్‌లో పతకాలు సాధించిన మంజుల

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఇందులో ఉమెన్స్ కేటగిరీలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన స్టాఫ్ నర్సు ఎల్. మంజులదేవి ప్రతిభ చూపారు. 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్ట్రోక్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఆసుపత్రి చరిత్రలో ఒక మహిళ స్విమ్మింగ్ పోటీలో పతకాలు సాధించడం ఇదే మొదటిసారి.

తైక్వాండో క్రీడకు సహకారమందిస్తా



బెల్టులు ప్రదానం చేస్తున్న బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణ

కర్నూలు (టౌన్) : దినదినాభివృద్ధి చెందుతున్న తైక్వాండో క్రీడకు తన వంతు సహకారం అందిస్తానని బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ కేఎంసీ పార్కులలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సంయుక్త కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమత్ వ్రతం



హనుమత్ వ్రతంలో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మన్య సూక్తం పవమాన సూక్తంతో అభిషేకం, హనుమత్ వ్రతాలు జరిగాయి. హనుమత్ కథ శ్రవణం, భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు నగర పెయింటింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఖాజాబాషా, చాంద్‌బాషా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మెహబూబ్‌బాషా, జాఫర్ బాషా, హనీఫ్‌బాషా, సహాయ కార్యదర్శులుగా మబ్బూల్, సలీంబాషా, ట్రేజరర్‌గా అఫ్రోజ్‌బాషాతోపాటు మరో 25 మందిని కమిటీసభ్యులుగా ఎంపికయ్యారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీలో పలువురికి స్థానం

కర్నూలు కల్చరల్ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కమిటీలో పలువురు నాయకులకు స్థానం కల్పిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రంగోల గోపి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కె.పావని, మీడియా కో-కన్వీనర్‌గా మునుస్వామి, నంద్యాల మన్‌కీ బాత్ ప్రోగ్రామ్ కో-కన్వీనర్‌గా రామ్ మనోహర్‌నాయుడులకు కమిటీలో స్థానం కల్పించారు.

గుంతను పూడ్చండి సారూ!



దేవనగర్ వినాయక ఘాట్ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా నడిరోడ్డుపై గుంత

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని దేవనగర్ వినాయక్ ఘాట్ పక్కనున్న మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా మంచినీటి పైప్‌లైన్ లీకై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో సుమారు ఐదు సార్లు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారని, అయినా లీకేజీ ఆగడం లేదని, లీకేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు పేర్కొంటున్నారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేశారు.



పెద్దాసుపత్రిలోని గుండె శస్త్రచికిత్స విభాగం

పెద్దాసుపత్రి అంటే రోగులకు పెద్ద నమ్మకం. ఇక్కడి వైద్యులంటే వారికి ఎనలేని అభిమానం. అందుకే ఎంత దూరం నుంచైనా వస్తారు. చికిత్స కోసం ఎన్నిరోజులైనా వేచి చూస్తారు. అలాంటి విభాగాల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండె శస్త్రచికిత్సల విభాగం ఒకటి. ఈ విభాగంలో ఎలాంటి గుండె ఆపరేషన్లు అయిన విజయవంతమవుతున్నాయి. ఇటీవల కాలంలో వైద్యుల సంఖ్య పెరగడంతో శస్త్రచికిత్సల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.



ఆపరేషన్ థియేటర్, బీటింగ్ హార్ట్ సర్జరీ పరికరం

ఇక్కడ గుండె పదిలం!

- పెద్దాసుపత్రిలో ఆధునిక గుండె ఆపరేషన్లు
- చిన్న కోత ఆపరేషన్లకు ప్రాధాన్యం
- వైద్యులపై నమ్మకంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు
- గతంలో ఒక్కరే డాక్టర్
- నేడు పెరిగిన వైద్యుల సంఖ్య
- ఫలితంగా అధిక సంఖ్యలో ఆపరేషన్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండె శస్త్రచికిత్సల విభాగం గత 2016లో తిరిగి ప్రారంభమైంది. ఆరేళ్ల పాటు ఈ విభాగంలో ఒక్కరే డాక్టర్ ఉండేవారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ విభాగంలో ఖాళీలన్నీ భర్తీ చేసింది. ఫలితంగా ప్రస్తుతం ఇందులో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. దీంతో ఇటీవల కాలంలో ఈ విభాగంలో ఆపరేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసుపత్రిలో మొట్ట మొదటి సారిగా ఈ విభాగంలో మాడ్యులర్ ఓటీని ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఇలాంటి ఆపరేషన్ థియేటర్లు ఆసుపత్రిలో మరో ఐదు ఏర్పాటు చేశారు. దీంతో ఇన్‌ఫెక్షన్‌కు తావు లేకుండా రోగికి శస్త్రచికిత్సలు చేసేందుకు వీలు కలుగుతోంది.

మూడేళ్లలో జరిగిన శస్త్రచికిత్సలు

సంవత్సరం	మేజర్	మైనర్	మొత్తం
2021	46	137	183
2022	115	467	582
2023	308	507	815

సీటీవీఎస్‌లో జరుగుతున్న శస్త్రచికిత్సలు

కార్డియోథొరాసిక్ విభాగంలో గుండెశస్త్ర చికిత్సలతో పాటు ఊపిరితిత్తులకు సంబంధించిన ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయి. అందులో బైపాస్ సర్జరీ, బీటింగ్ హార్ట్ సర్జరీ, మినమల్లీ ఇన్‌వేసివ్ కార్డియాక్ సర్జరీ, గుండెలో రంధ్రాలు పూడ్చటం, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సల్లో న్యూమనెక్టమి, లోబెక్టమి, డీకార్టికేషన్, వాస్కులర్ సర్జరి (కాళ్ల రక్తనాళాల ఆపరేషన్), ఏవీ ఫిస్టులా ఆపరేషన్ ఉన్నాయి.



అత్యాధునిక వసతులతో ఐసీయూ విభాగం



డయాలసిస్ మిషన్

డాక్టర్లు బాగా చూసుకుంటున్నారు



నాకు 53 సంవత్సరాల వయస్సు. చేనేత కార్మికుడిని. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. బిడ్డకు వివాహమైంది. ఈనెల ఐదో తేదిన నాకు ఉన్నఫలంగా గుండెపోటు వచ్చింది. పిల్లలు ఆసుపత్రిలో చేర్పడంతో గత శుక్రవారం డాక్టర్లు ఆరోగ్యశ్రీ పథకం కింద బైపాస్ ఆపరేషన్ చేశారు. ఆసరా కింద ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో రూ.9,500 కూడా జమ చేసింది. ఆసుపత్రిలో డాక్టర్లు బాగా చూసుకుంటున్నారు.

–చిన్నగిడ్డయ్య, కోడుమూరు

మూడు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయన్నారు



నాకు 56 ఏళ్లు. చాకలి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్మోకింగ్ అలవాటుంది. ఈ నెల 14వ తేదీన గుండె పోటు రావడంతో పిల్లలు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి గుండెలో మూడు రక్తనాళాలు పూడుకుపోయాయి బైపాస్ సర్జరీ చేయాలని చెప్పారు. గత సోమవారం ఆరోగ్యశ్రీ పథకం కింద బైపాస్ సర్జరీ చేశారు. ఆసరాగా రూ.9,500 కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఇక్కడి వైద్యులతో పాటు సిబ్బంది కూడా బాగా చూసుకుంటున్నారు. వసతులు, సౌకర్యాలు ప్రైవేటు ఆసుపత్రి కంటే బాగున్నాయి.

–లోకరాజు, మద్దూరు నగర్, కర్నూలు

డాక్టర్లపై నమ్మకంతో వస్తున్నారు



మా విభాగంలో వైద్యులపై నమ్మకంతో రాయలసీమ జిల్లాలతో పాటు కోస్తా ప్రాంతం నుంచి సైతం రోగులు చికిత్స కోసం వస్తున్నారు. గతంలో ఈ విభాగంలో ఒక్కరే డాక్టర్ విధులు నిర్వహించాల్సి వచ్చింది. గత రెండేళ్లుగా ఈ విభాగంలో అన్ని వైద్యుల పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. గతంలో నెలకు 10 ఆపరేషన్లు చేసేవాళ్లం. ఇప్పుడు 20కి పైగా చేస్తున్నాము.

–డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

ఈ - కామర్స్, డిజిటల్ పేమెంట్‌పై అవగాహన అవసరం

- నంద్యాల జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: వినియోగదారులకు ఈ - కామర్స్, డిజిటల్ వర్తకంపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా ఈ - కామర్స్, డిజిటల్ వర్తకశకంలో వినియోగదారుల రక్షణ అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తాము కొన్న వస్తువులపై నాణ్యత, ధర, వారంటీ తదితర అంశాలపై పూర్తి అవగాహన పొంది ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ - కామర్స్, డిజిటల్ పేమెంట్‌లపై కూడా అవగాహన పొంది నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోసపూరిత వ్యాపారస్తులకు అడ్డుకట్ట వేసే వినియోగదారుల చట్టం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రతి వినియోగదారుడు భద్రతా హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, విన్నవించుకునే హక్కు, విద్యను పొందే హక్కు, నష్టపరిహారం పొందే హక్కు, సమాచారం పొందే హక్కుపై సంపూర్ణ అవగాహన పొంది ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఈ ఏడాది అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 24 వరకు ప్రత్యేక వారోత్సవాలు నిర్వహించామన్నారు. విద్యాసంస్థలు, కళాశాలలు, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు.

పెద్దపేగు...చిన్నపేగు కలిసే చోట కణితి

- శస్త్రచికిత్స చేసి ఊరట కలిగించిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): క్షయ కారణంగా కడుపులో పెద్దపేగు, చిన్నపేగు కలిసే ప్రాంతంలో ఒక గడ్డలా కణితి ఏర్పడి చాలా కాలంగా ఇబ్బంది పడుతున్న ఓ రోగికి కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి ఊరట కల్పించారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సూరా జానకిరామ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఆదివారం వెల్లడించారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్ కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పి, విరేచనం కాకపోవడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈ సమస్యలతో ఆయన ప్రొద్దుటూరు, కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో వైద్యులను కలిసి చికిత్స తీసుకున్నారు. వారిలో ఒకరు చిన్నపేగుకు, పెద్దపేగుకు కలిపి ఒక స్టెంట్ వేశారు. సాధారణంగా క్యాన్సర్ కేసుల్లోనే స్టెంట్ వేస్తారు. అది కూడా తాత్కాలికం. స్టెంట్ వేసినా సమస్య తీరకపోవడంతో ప్రవీణ్‌కుమార్ కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చాడు. ఇక్కడ వైద్యపరీక్షలు చేసిన అనంతరం కణితి ఉన్నట్లు గుర్తించి దానిని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ కణితిని బయాప్సీ తీసి పంపిస్తే క్షయ అని తేలింది. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నా'డని డాక్టర్ జానకిరామ్ తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారంతో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. శనివారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో చేపట్టిన దీక్షలకు ఆర్‌టీఏ జిల్లా మాజీ కార్యదర్శి బాబు, ఐలు సంఘం జిల్లా నాయకులు మురళీ మోహన్, ఒంకార్, రవికుమార్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మలమ్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిమ్మన్న మద్దతు తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఆదివారం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లోని దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ..అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ. 26 వేల జీతం ఇవ్వాలన్నారు. 62 సంవత్సరాలకు పదవి విరమణ వయస్సు నిర్ధారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, చంద్రశేఖర్, వీరశేఖర్, ఎస్.శేషయ్య, టి.రాముడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ సచివాలయాల పరిధిలో ఈనెల 26 నుంచి ప్రారంభంకానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాలను విజయవంతం చేద్దామన్నారు. నైపుణ్యం గల క్రీడాకారుల గుర్తించి ప్రోత్సహించడమే పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్‌మెంటన్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 26వ తేది ఓర్వకల్లు మండలం కాల్వ, హుస్సేనాపురం సచివాలయాల్లో జరిగే క్రీడా పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రశాంత్ కిషోర్ టీడీపీ అధినేత చంద్రబాబు కలయికపై విలేకరులు ప్రశ్నించగా రాజకీయాల్లో ఎవరు ఎవరినైనా కలవచ్చునన్నారు. అంతిమంగా ఎవరికి అధికారం కట్టబెట్టాలో నిర్ణయించేది ప్రజలే అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్‌సీపీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, మేఘనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పల్ల రవీంద్రనాథ్ కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విరాళాన్ని ఆలయ ఈఓ రామానుజన్‌కు ఆదివారం అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఈఓ, ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం అందజేసి సత్కరించారు.



ఆలయ ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన గణేష్ నగర్‌లోని చర్చి

క్రిస్మస్ కాంతులు

క్రైస్తవ ప్రార్థనా మందిరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, యేరుషాలేమ్, స్టాంటన్ చర్చి, సీఎస్ఐ చర్చి, రాక్‌వుడ్ చర్చి, నంద్యాలరోడ్ లోని బిషప్ చర్చి, సి.క్యాంపులోని ప్రార్థనా మందిరం, హోసన్నా మందిరం, అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, మద్దూర్‌నగర్, బుధవారపేట, దేవనగర్, లక్ష్మీనగర్, శరీన్‌నగర్, జొహరాపురం తదితర ప్రాంతాల్లోని చర్చీలు విద్యుద్దీపాలతో వెలుగులీనుతున్నాయి. ప్రత్యేక అలంకరణతో ప్రధాన వీధుల్లో క్రిస్మస్ కాంతులు విరజిమ్ముతున్నాయి.

–సాక్షి, ఫొటో గ్రాఫర్, కర్నూలు



కోల్స్ చర్చి ప్రాంతంలో విద్యుత్ అలంకరణ



రాక్‌వుడ్ చర్చి



కోల్స్ చర్చిలో క్రిస్మస్ ట్రీ, స్టార్లు, పశువుల పాకతో ప్రత్యేక అలంకరణ



సర్వాంగ సుందరంగా సీఎస్ఐ చర్చి



విద్యుత్ దీపాలంకరణలో సీక్యాంప్ సెంటర్‌లోని ప్రార్థన మందిరం

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



బిషప్ చర్చిలో భారతి సిమెంట్ డిస్ట్రిబ్యూటర్లు అందజేసిన కేక్ కట్ చేస్తున్న చర్చి ఫాదర్

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భారతి సిమెంటు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చి, సి. క్యాంపు ప్రార్థన మందిరం, ఆర్ఎస్ రోడ్డులోని రాక్‌వుడ్ చర్చి, కోల్స్ సెంటీనియల్ చర్చి, వెంకటరమణ కాలనీలోని సీఎస్ఐ చర్చిలలో కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ మధు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ అసిస్టెంట్ మేనేజర్ ఇక్బాల్ బాషా, డిస్ట్రిబ్యూటర్లు ఎద్దుల సూర్య రెడ్డి, సందీప్, టెక్నికల్ ఆఫీసర్ ఉదయ్, గోపాల్, చక్రపాణిరెడ్డి, రంగముని పాల్గొన్నారు.

చీరల పంపిణీ

కర్నూలు (రాజ్‌విహార్) : క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్ర బోస్ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. స్థానిక సి.క్యాంప్ సెంటర్ వద్ద ఉన్న తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో వెలసిన పురాతనమైన కోనేటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం గన్నవరం పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమద్ వ్రతం సందర్భంగా గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.